# ఏ గాలికి ఆ చాప

పోలీసు వెంకటస్వామి ఎర్రరే కళ్ళతో రోడ్డుమీద అటూ ఇటూ తిరుగుతున్నాడు. రోడ్డుకు అటువైపు ఒక సినిమా హాలుంది. అందులో చల్లనిరాత్రి సినిమా ఆడుతోంది. మొదటి రోజు ఏదయినా ఓ కేసు దొరకకపోతుందా అని ఆలోచిస్తున్నాడు. సినిమా హాలుకు ఎదురుగా రోడ్డుకు ఈవలివైపున గుడిసెలు, వసారాలూ ఉన్నాయి. వాటి మధ్యగా ఓ టీ బంకు కూడా ఉంది.

వెంకటస్వామి చిన్నవి, పెద్దవి కేసులు చాలా పట్టి, వీళ్ళేమనుకుంటారో అనుకోకుండా వచ్చినంతవరకు దులుపుకొని డబ్బు ప్రోగుచేసే వాడు. ఇంట్లో ఉండే ఫర్నిచరు చూస్తే అతన్ని ఒక లక్షాధికారి అనుకోవచ్చు.

ఉద్యోగంలో చేరి ముప్పయి ఏళ్ళయినా ఇంకా ప్రమోషన్ రాలేదు. కారణం ఏమిటయ్యా అంటే ఇతని వ్యవహారాలు ఎప్పటికప్పుడు ఇనస్పెక్టర్ దృష్టికి పోతుండడం ఆయన వార్నింగులు ఇచ్చి వదిలేయడము జరుగుతూ ఉండేది. దాంతో అతనికి ఉద్యోగమూ ఊడక, ప్రమోషనూరాక మధ్యస్తంగా ఉండిపోయాడు.

ఇదంతా రెండేళ్ళక్రితం సంగతి. మరి ఇప్పుడో వెంకటస్వామి చాలా సిన్సియర్. అతనిపట్టు జలగపట్టు. నేరంచేసిన వాడు దొరికాడూ అంటే కేసు బుక్‌చేసి యస్సయి ముందు నిలబెట్టాల్సిందే. ఆ స్టేషన్లో మిగతా ఏ పోలీసు గుండె అయినా కరుగుతుందేమో గాని వెంకటస్వామి విషయంలో అది జరుగదు. నేరం చేసినవాడికి శిక్ష పడాల్సిందే. అనేది అతని ఆర్గ్యుమెంటు.

తెలిసిన వాళ్ళకు ఇంతగా మారిపోయిన వెంకటస్వామిని చూస్తే ఆశ్చర్యంగా వుంటుంది. మానవమాంసం రుచి మరిగిన పులి ఒక్కసారిగా శాకాహారిగా అయ్యిందంటే ఎవ్వరూ నమ్మరు. కాని వెంకటస్వామి విషయంలో అది నూటికి నూరుపాళ్ళు యదార్థం. అతనిప్పుడు స్వచ్ఛమయిన పాల వంటివాడు. జీతం డబ్బులు తప్ప మరేమీ ముట్టుకోడు. కారణం...

కరుణాకరం యస్సయిగా ఆ స్టేషనుకు వచ్చిన రోజే అందరి పర్సనల్ ఫైల్సూ చదివాడు. అందరిదీ ఒకరకంగా ఉంటే వెంకటస్వామిది గందరగోళంగా ఉంది. చదువుతుంటే ఎన్నో వింత విషయాలు తెలుస్తున్నాయి.

రెండోరోజు డ్యూటీలో ఉన్నప్పుడు వెంకటస్వామిని తన దగ్గరికి పిలిపించాడు పర్సనలు మేటరుందని. మిగతా కానిస్టేబుళ్ళనూ, రైటరునూ బయట ఉండమన్నాడు. వెంకటస్వామి భయపడుతూనే యస్సయి గారికి సెల్యూట్ చేసి నిలబడ్డాడు. యస్సయి గారు కూర్చోమన్నా కూర్చోలేదు.

అప్పుడు యస్సయిగారు లేచి తన రెండు చేతులనూ వెనుకబెట్టుకొని, ఆ చివర్నించి ఈ చివరి వరకూ తిరుగుతూ చిన్న ఉపన్యాసం లాంటిది ఇచ్చాడు.

"మిస్టర్ వెంకటస్వామీ! నీ పర్సనల్ ఫైలంతా చదివాను. చాలా ఘోరంగా, అసహ్యంగా, భయంకరంగా ఉంది. నిన్ను ఏ గ్రౌండ్సు మీదయినా వెంటనే సస్పెండు చేయవచ్చు. నిన్నలా సస్పెండు చేయమని యస్ పి గారికి రిపోర్టు వ్రాయలేను. ఎందుకంటే నేనూ మనిషినే. ఒక మనిషి చెడ్డవాడు కావడానికి వెనుక ఎన్నో బలవత్తరమయిన కారణాలుంటాయి. అంతేగాని మనిషి పుట్టగానే చెడ్డవాడుగా పుట్టడు. ఇప్ప

టికి మించిపోయింది లేదు. నాకు సిన్సియారిటీ కావాలి. నేను చెప్పినట్లు విన్నావంటే నీకెంతో ఉచ్ఛదశ కలుగుతుంది. ఇప్పటివరకూ జరిగిన వన్నీ మర్చిపోతాను. నీ ప్రవర్తన బాగుంటే నీ మీద మంచి రిపోర్టు వ్రాస్తాను. ఇలాగే ఒకరిద్దరు వ్రాసారంటే నీ గత చరిత్ర మరుగునపడి పోయి నీకు వెంటనే రెండు, మూడేళ్ళలో హెడ్‌కానిస్టేబులు ప్రమోషను వస్తుంది. నీకంటే పదేళ్ళు వెనుక సర్వీసులో చేరిన నేను ఈనాడు నీ ముందు యస్సయిగా నిలబడ్డానంటే కారణం నా సిన్సియారిటీయేనని గర్వంగా చెప్పగలను. ఏమంటావు...?"

విజ్ఞానమనే ముఖంతో వెలిగిపోతున్న ఎస్సయి ముఖంలోకి సూటిగా చూశ్కేక తలవంచుకొని "జరిగినదానికి క్షమించండి సార్. ఇక నుంచి సిన్సియర్‌గా వుంటాను" అన్నాడు వెంకటస్వామి.

"వెరీగుడ్" అని భుజంతట్టి షేక్ హాండిచ్చాడు ఎస్సయి. ఆ రోజు నుంచి మారిపోయాడు వెంకటస్వామి.

మొదట్లో కొంచెం బాధగా వున్నా క్రమేణా నీతికి, నిజాయితీకి అంకితమయిపోయాడు వెంకటస్వామి. ఓనెల క్రితమే యస్సైయి కరుణా కరాన్ని సి.ఐగా ప్రమోషనిచ్చి దూరంగా వేసారు. కరుణాకరాన్ని కళ్ళ నీళ్ళతో వీడ్కోలిచ్చాడు. కరుణాకరం పోతూపోతూ వెంకటస్వామిమీద అద్భుతమైన రిపోర్ట్ వ్రాసి మరీ వెళ్ళాడు...

ఇప్పుడు సినిమా మొదట ఆట వదిలేసి, రెండో ఆట కూడా మొద లయ్యింది. వెంకటస్వామి టీత్రాగి వుసూరుమంటూ అక్కడే వున్న బెంచీ మీద కూర్చొని గుడిసెల వైపు చూస్తున్నాడు. ఇంతలో అతని కళ్ళు మెరిసాయి. ఎవడో దిక్కులు చూస్తూ పంచె ఎగగట్టి కొద్ది దూరంలో వున్న గుడిసెలో దూరాడు. వెంటనే గుడిసె తలుపుకున్న తడిక మూసుకొంది. వెంకటస్వామి టీ బంకులోంచి బయటకు వచ్చి

టోపీ సర్దుకుని, లాటీ చేతిలో గిర్రున త్రిప్పుతూ ఆ గుడిసెవేపు అడుగులు వేసాడు. రెండు నిముషాల్లో గుడిసె చేరుకుని తడికె తట్టాడు.

కొద్దిసేపటికి తడిక తెరుచుకుంది. లోపల్నుంచి తొంగిచూసిన ఆడమనిషి బిర్రబిగుసుకుపోయింది. లోపలకు చెయ్యి పోనిచ్చి ఆడమనిషి జుట్టుపట్టుకొని బయటకు లాగాడు వెంకటస్వామి.

"ఏందయ్యో! ఏటిది వదిలిపెట్టు"

"వదల్తాను లేయే! వాడేడీ" అంటూ "రేయ్ బయటికి రారా" అంటూ అరిచాడు వెంకటస్వామి.

వణుకుతూ బయటికి వచ్చాడు ఓ పల్లెటూరి యువకుడు. ముఖమంతా చెమటతో నిండిపోయి వుంది.

"ఏరా దొంగనాయాలా! ఇదేంపని, అంతగా క్రొవ్వెక్కితే పెళ్ళి చేసుకోకూడదట్రా" లాటీతో రెండు కాళ్ళమీద బాదాడు.

పల్లెటూరి యువకుడు కుయ్యో, మొర్రో అని ఏడుస్తూ "బాబోయ్ నాయనోయ్ దణ్ణం పెడతా సామే! నానింకెప్పుడూ చేయన్రో" అంటున్నాడు.

"ఎందుకయ్యా అట్టా గింజుకుని ఏడుత్తావు. ఓ రెండ్రూపాయలు పోలీసాయన సేతిలో ఎట్టు. మాట్టాడకుండా పోతాడు" అంది తన బొడ్డులోంచి ఓ రూపాయతీసి ఇస్తూ ఆ ఆడమనిషి.

"ఏమిటిది?" వెంకటస్వామి గొంతు ఖంగు మంది.

"ఏం చేత్తాం. బిజినెసుల్లేవు. ఏంటబ్బాయ్ ఇంకా సూత్తావు. ఆయనకు రెండ్రూపాయలియ్యి"

పల్లెటూరి యువకుడు జేబులోంచి రెండు రూపాయలనోటు బయ

టికి తీసి కోపంతో వున్న పోలీసు ముఖం చూస్తూ గమ్మున వుండి పోయాడు.

"చేసిన పనికి సిగ్గుపడి లెంపలేసుకుని క్షమించమని చెప్పక లంచ మిస్తావటే నాకు. నిన్ను చంపినా పాపంలేదు" అంటూ ఆమె నడ్డిమీద రెండంటించాడు.

ఆమె పడే దెబ్బలకు రెండు చేతులూ అడ్డుపెడుతూ, "ఏటయ్యో లంచమా? నువ్వేనా ఈ మాట సెప్పేది. గుడిసెగుడిసెకాడ కాసుకో నుండి పతి పేసింజరు దగ్గర అర్ధరూపాయి వసూలు సేసే వెంటకసామి మామ నే సేసిన పని సిగ్గుమాలిన పనంటే లోకమే దద్దరిల్లిపోదా!"

వెంకటస్వామికి ఆ మాటలు గుండె కలుక్కుమనిపించాయి. కొద్దిగా సౌమ్యంగా, "అది ఒకప్పటి మాటే! ఇప్పుడు నేను పైసా లంచం తీసుకోను. తప్పుచేసినవాడ్ని శిక్షించిన దాకా నిద్రపోను"

"అద్గదీ! అదా? నేను ఊళ్ళో లేనులే! బిజినెస్ మీద నచ్చిన దేసం ఎల్లి, పదిరోజులకిందనే వచ్చినా. ఓరుకూడా నాకి సంగతి సెప్పలేదు" ముక్కుమీద వ్రేలేసుకొంది ఆడమనిషి.

"సరే, విషయం చెప్పానుగదా! నడవండి పోలీసు స్టేషనుకు."

"మీరిట్టా మారిపోయిన్రు గనుక ఇంకో రెండు రూపాయలు ఎక్కువ తీసుకోండి" అంటూ బొడ్లోంచి, మడచిన కాగితాలు బయటకు తీసింది.

వెంకటస్వామికి ఒళ్ళు మండింది. "ఏమిటే! ఇంత ప్రశాంతంగా చెప్పినా నీ బుర్ర కెక్కలేదంటే ఏమనుకోవాలి? పద స్టేషనుకు లంజా-" అంటూ ఆమె జుట్టు పట్టుకుని లాగాడు.

"ఏటయ్యో మాలావు కోపమొచ్చిందే! దేసను మొగం మేమెరగ మనుకున్నావా ఏంది? రోజూకు పదిసార్లు ఎల్లి, పదిసార్లు వస్తుంటాం" అంటూ వెంకటస్వామి చేయి విదిలించుకొని రోడ్డెక్కింది ఇదంతా చూస్తున్న పల్లెటూరి యువకుడు తనేమైనా అంటే ఎముకలు విరిచేస్తాడని తనూ ఆమె వెనకనే నడవసాగాడు భయం భయంగా.

పోలీసు స్టేషను చేరింతర్వాత, వాళ్ళిద్దర్నీ యస్సై దగ్గరకు నడిపించి సెల్యూట్ చేసి, "సార్ బ్రోతల్సు సార్! ఆంజనేయ టాకీస్ దగ్గర పట్టుకున్నాను" అన్నాడు.

సబ్ ఇన్స్పెక్టర్, ఏదో ఇనస్పెషను రిపోర్టు రాసుకుంటున్న వాడల్లా తలెత్తి చూసి "హలో త్రిలోకసుందరీ! ఏమిటీ రాక? ఇన్నాళ్ళకు మా మీద దయకలిగిందా" అంటూ చిరునవ్వుతో పలుకరించాడు.

త్రిలోకసుందరి వగలుపోతూ యస్సైకి ఎదురుగా వున్న కుర్చీలో కొత్త పెళ్ళికూతురిలా కూర్చొంది. పోలీసు వెంకటస్వామికి వళ్ళు మండిపోయింది. లేపి తందామని అనిపించింది ఈమె తన అధికారికి తెలిసిన మనిషా? అయినా యస్సైగారు తను చెప్పింది విన్నట్లులేదు. వింటే ఇంత మర్యాదగా మాట్లాడతాడా అనుకున్నాడు.

"సార్! ఇది బ్రోతల్. ఇద్దరూ గుడిసెలో ఉంటే రెడ్ హాండెడ్‌గా పట్టుకున్నాను." ఏమైతే అదయిందని చెప్పాడు వెంకటస్వామి.

"అఁ...చాలా ఆనందించాంలే! రేయ్ టూ నాట్ ఫోర్, వీడ్ని నాలుగు తన్ని రాత్రికి లాకప్‌లో ఉంచి, తెల్లారి వదిలెయ్."

యస్సై ఆజ్ఞను పురస్కరించుకుని ఓ పోలీసు వచ్చి పల్లెటూరి యువకుడ్ని లోపలకు లాక్కుపోయాడు.

త్రిలోకసుందరి యస్సై టేబులుమీదున్న పేపరు వెయిట్‌తో ఆడు కుంటూ ఉంది. యస్సై కొద్దిసేపటికి వ్రాయడం పూర్తిచేసి, "సుందరీ! నేను చెప్పినట్టు ఈ రోజు రాలేకపోయాను. ఏమనుకోకు. రేపు రాత్రి పది గంటలకు మన మామూలు చోటికి వచ్చేయ్! ట్రిమ్‌గా టాయిలెట్ అయి రావాలి" అన్నాడు పగలబడి నవ్వుతూ.

"దొరగారి ఆజ్ఞ మీరు ఎక్కడికి ఎప్పుడు రమ్మంటే అప్పుడు మా వాడ అంతా రెడీ!" యస్సైకి కన్ను కొట్టి లేచి నిలబడింది

"ఏమోయ్ వెంకటస్వామీ! నీ ప్రవర్తన సరిగా లేదు ఇంతకు ముందు బాగానే వుండే వాడివటగా! ఆ యస్సై కరుణాకరం మాట విని చెడిపోయానంటున్నరంతా. ఇకనైనా మారు. కొన్ని విషయాల్లో చూసీ చూడనట్లు పోతుండాలోయ్! నేను తెలుసని చెప్పిన వారెవర్నీ ముట్టుకోకు తెలిసిందా? ఈ రోజుల్లో నీతికీ నిజాయితీకి అంకితమయితే లాభంలేదోయ్ డబ్బు వుంటేనే సంఘంలో విలువ. కాబట్టి నన్ను ఫాలోగా బాగుపడ తావ్!"

వెంకటస్వామి ఏమీ అనలేక, అధికారి ముందు వుండే సహజమైన బలహీనతతో "అలాగే సార్" అంటూ తల వూపాడు.

"వెరీగుడ్ వెంకటస్వామీ! నీవు మారుతావు నాకు తెలుసు. ఇదిగో త్రిలోకసుందరిని వాళ్ళింట్లో జాగ్రత్తగా దించు. దారిలో ఓ టీ ఇప్పించు. మన మనుషులకు మనం మర్యాద చేయకపోతే ఎలా?"

త్రిలోకసుందరి దారిలో ఏదేదో చెబుతూ వుంది. వెంకటస్వామి అదేమీ వినడంలేదు! ఏమిటి ఇదంతా? లోకంలో రెండు రకాల వ్యక్తులు వున్నమాట నిజం. కొంత మంది నీతికి అంకితమయితే, మరికొందరు అవినీతిని జీర్ణం చేసుకొన్నవారు. ఎవరిమాట వినాలి? ఎవరిమాట విన

కూడదు? అవినీతిగా వున్నవాడు ఎవడు నాశనమయ్యాడు? కనుక ఒక్కొక్కడి అదృష్టం, దురదృష్టాలను బట్టి జీవితం నడుస్తుంది అంతేగాని నీతి నిజాయితీలను బట్టి కాదు.

ఒక కంపెనీ ముందముందు తనకెంత అవమానమయింది తనింత కష్టపడి పట్టుకుపోతే, దానిముందే తనను యస్సైగారు చీవాట్లేసి దాన్ని మర్యాదచేశారు. ఇప్పుడు యస్సైకి ఎదురు తిరిగితే తను జీవితంలో ఎన్నో కష్టాలు పడవలసి వస్తుంది. కరుణాకరంగారు చెప్పినట్లు నీతి నిజాయితీలకు విలువే వుంటే తనీనాడు, ఇన్ని అవమానాలు ఎందుకు పడవలసి వస్తుంది? ఎవరి దారి వారిది. ఒకరికి బాగు అనిపించింది మరొకరికి చెడుగా అనిపించవచ్చు. ఏ గాలివాలుకు ఆ దిశగా పయనించడమే తనకు మంచిది. లేకపోతే ఉద్యోగం చేయడం చాలా కష్టమనుకున్నాడు.

ఇంతలో సినిమా హాలు వచ్చేసింది.

"అమ్మాయ్! టీ త్రాగి వెళ్ళు" అంటూ పిలిచాడు.

స్టూలుమీద కూర్చుని తూగుతున్న టీ కుర్రాడు వెంకటస్వామి తట్టేసరికి లేచి కూర్చుని, "ఏటి రెండు టీలా?" అన్నాడు వెంకటస్వామినీ, త్రిలోక సుందరినీ మార్చి మార్చి చూసి నవ్వుతూ.

"అఁ..." అన్నాడు వెంకటస్వామి ఇబ్బందిగా ముఖం పెట్టి.

"తొందరగా కానియ్యరో! నాకవతల అర్జంటు పనులున్నాయి" చిలకలా నవ్వింది త్రిలోకసుందరి.

రెండు నిమిషాల్లో టీలు త్రాగి ఇద్దరూ రోడ్డు మీదికి వచ్చారు

"ఎంకటసామి మావా! వస్తావా ఏంది? నేను యస్సై బాబుకి చెప్పన్లే!" అంది కవ్విస్తూ.

వెంకటస్వామి అప్పటికే ఆలోచనలతో చాలా దిగజారిపోయి

వున్నాడు. "ఈసారికి వస్తాన్లే అమ్మాయ్ నువ్వెళ్ళు" అన్నాడు. యస్సై గారికి ప్రియమైనది గనుక మర్యాదగా మాట్లాడాడు.

త్రిలోకసుందరి వెళ్ళిన తరువాత వెంకటస్వామి పూర్తిగా మారి పోయాడు. పూర్వపు వెంకటస్వామి అయ్యాడు వారం రోజులు నిరాహార దీక్ష చేసి, తిండికోసం అర్రులు చాచేవాడిలా వెంకటస్వామి నాలుక తడు పుకోసాగాడు. పూర్వం తెల్లవారేసరికి తన జేబులు చిల్లరతో, కాగితాలతో నిండిపోయి ఉండేది. నైట్ డ్యూటీ పడిందంటే అదృష్టం పండినట్టే. రెండేళ్ళుగా నీతి, నిజాయితే అని మడిగట్టుకు కూర్చొని ఏమీ సాధించలేక పోయాడు.

ఇంతలో సినిమా అయిపోయినట్లుగా హాల్లోంచి బెల్లు వినబడింది. మెయిను గేటు తెరచుకొంది. బిలబిలామంటూ అందరూ బయటికి వస్తు న్నారు. వెంకటస్వామి కోడిపిల్లలకోసం ఎదురుచూసే గ్రద్దలా దీక్షగా చూడసాగాడు. ఏ చిన్న కేసు దొరికినా చాలు నాలుగు రూపాయలు పడు తాయి కేసులు ఎలా పట్టాలో వెంకటస్వామికి వెన్నతో పెట్టిన విద్య.

ఏ చిన్న తగవుగాని, కీచులాటగాని జరుగుతుందేమోనని ఎదురు చూడసాగాడు. కాని అతని ఆశనిరాశ అయింది. అందరూ వెళ్ళిపోయారు. చివరగా వచ్చిన ఓ యాభయ్ ఏళ్ళ వ్యక్తి అటూ ఇటూ చూసి అందరూ వెళ్ళిపోయారని తేల్చుకొని సినిమాహాలు గోడకు చివరగా వెళ్ళి మూత్ర విసర్జన చేయసాగాడు. వెంకటస్వామి శరీరం ఆనందంతో పులకించి పోయింది. వెంటనే ఆ వైపు అడుగులు వేసాడు.

మూత్ర విసర్జన పూర్తిచేసి లేవబోయే ఆ వ్యక్తిని తనే వెనుక నుంచి కాలరు పట్టుకొని పైకి లేపాడు వెంకటస్వామి. "ఏమిటోయ్. ఏంది నువు జేసేది" అన్నాడు గద్దింపుగా.

"ఎవరండీ. అయ్ బాబోయ్. పోలీసాయనా. నమస్కారమండీ! ఏంటండే!"

"అవన్నీ తర్వాత గాని, ఏవూరు నీది?"

"నా పేరు సుబ్బయ్యండీ. ఈ ప్రక్కనే పల్లె పల్లెపాడండీ మాది."

"ఓహో. అయితే...నిన్ను పబ్లిక్ రోడ్డులో ఎవడు పోయ మన్నాడ్రా ఒకటికి."

"అయ్యా చెమించండి. రోడ్డుమీద ఎవరూ లేరు గందా. ఒంటి గంట రాత్తిరి అయిందిగందా అని పోసానండీ. తప్పండీ"

"ఏరా. తప్పా అని నన్నే నిలదీస్తున్నావా. నీమీద పబ్లిక్ న్యూసెన్సు కేసు పెడుతున్నాను. పద స్టేషనుకు"

"బాబోయ్. అదేటి నాయమండే. ఎవ్వరూ లేనప్పుడు ఓ మూల ఒకటికి పోయడంకూడా తప్పంటారా సామే" లబలబలాడా డామనిషి.

"ఏట్రా. తప్పొప్పులు నాకే చెప్పొచ్చావా. రాస్కేల్. పద స్టేష నుకు" మెడమీద చేయిపెట్టి నెట్టాడు వెంకటస్వామి

"సామే. నే నాను పెళ్లాం పిల్లలు గల్లోణ్ని. నన్ను జెయిల్లో తొయ్యొద్దు"

"అట్లా జరక్కుండా చూడాలంటే నువ్వోపని చెయ్యాల" వెంకట స్వామి గొంతు తడబడింది.

"ఓ పదిరూపాయలుంటే పడెయ్యి. నిన్ను వదిలేస్తాను" గబు క్కున అనేసి ఏదో గొంతుకడ్డం పట్ట పడ్డట్టయి అనిపిస్తే దగ్గాడు. ఒక

ప్పుడయితే అతి తేలిగ్గానూ, ఆనందంగానూ అనేవాడు. కాని ఇప్పుడు కొత్తగా ఉంది.

"నా దగ్గర లేవు సామే" ఏడుపు ముఖం పెట్టాడా వ్యక్తి.

"ఏమీలేవా" మళ్ళీ అడిగాడు వెంకటస్వామి.

"పైసాలేదు సామే. జేబులో బీడీకట్టమాత్రం ఉంది ఉండాది. నన్ను ఇడవండి సామే. నాలుగుమైళ్ళు నడిసి ఎల్లాల మళ్ళీ.

"ఇక లాభంలేదు పద స్టేషనుకు"

వెంకటస్వామి ఆ వ్యక్తి చేయిపట్టుకొని లాగాడు. సైకిలుమీద దూరంనుంచి వస్తున్న ఒక వ్యక్తి ఈ ఘర్షణ చూసి సైకిలు దిగాడు.

"ఏమిటి? ఏం జరిగింది?"

"ఏం జరిగితే నీకెందుకు?" నీదారిన నువ్వు పోవయ్యా" అన్నాడు పోలీసు వెంకటస్వామి కఠినంగా.

"నా దారిన నేనుపోక, నీ దారికి ఎందుకు అడ్డం వస్తావను కున్నావు. ఏం జరిగిందని ఆ పెద్దమనిషిని అడుగుతున్నాను" ఇంకా కఠినంగా జవాబిచ్చాడా నూతన వ్యక్తి.

"వీడెవడో ఈ ఊరివాడి లాగున్నాడు. వీడితో ఎందుకు గొడవ. వచ్చేదబ్బులు ఎలాగూ వస్తాయి. ఏం మాట్లాడుకొంటారో మాట్లాడుకోనీ, అని మనసులో అనుకొని ఏమయ్యోయ్ నువ్వు ఎన్ని చెప్పినా వీడ్ని వదిలి పెట్టేది లేదు. అది గుర్తుంచుకో" నూతన వ్యక్తితో అన్నాడు వెంకటస్వామి.

ఆ నూతనవ్యక్తి సుబ్బయ్య అనే పల్లెటూరి వ్యక్తిని ప్రక్కకు పిలిచి ఏమిటని అడిగాడు. అతనంతా చెప్పాడు.

ఇతనేదో సలహా ఇచ్చాడు. చూస్తున్న వెంకట స్వామికి ఏమీ విశ ఇద్ధంలేదు. చిన్నగా మాట్లాడుకొంటున్నారు. ఓ పదినిముషాల తర్వాత నూతన వ్యక్తి సైకిలెక్కి వెళ్ళిపోయాడు. సుబ్బయ్యను స్టేషనువైపు నడిపించాడు వెంకటస్వామి.

* * * *

అది ఉదయం పదకొండుగంటల సమయం. ఎప్పటిలాగే మున్సిఫ్ మేజిస్ట్రేటు కోర్టు ఆవరణ చెట్లక్రింద మనుషులు గుంపులు గుంపులుగా నిలబడి మాట్లాడుకొంటున్నారు. వెంకటస్వామి వరండాలో నిలుచుని ఉన్నాడు. సుబ్బయ్య తుండుగుడ్డ నెత్తినవేసుకొని, గుంజనానుకొని దిగులుగా కూర్చున్నాడు నిముషాలు మందంగా గడుస్తున్నాయి.

"సుబ్బయ్యా!...సుబ్బయ్యా!" కోర్టుబంట్రోతు పిలుపుకు భయముగా లేచి నిలబడ్డాడు సుబ్బయ్య.

"పద లోపలికి" అంటూ సుబ్బయ్యను లోపలికి నెట్టాడు వెంకటస్వామి.

సుబ్బయ్య లోపలికి వెళ్ళి బోనులో నిలబడ్డాడు.

"సుబ్బయ్య సినిమాహాలు రోడ్డుమీద విచక్షణా జ్ఞానం వదలి అడామగా కలిసినడిచేటప్పుడు అసభ్యంగా అందరూ చూసేట్లు మూత్ర చేసాడు కనుక కోర్టువారు ఇతనికి తగిన దండన విధించవలసినదిగా కోరుచున్నాను" అంటూ గవర్నమెంటు ప్లీడరు కేసుచదివి కూర్చొన్నాడు.

సుబ్బయ్య అంతా నిజమే చెబుతానని ప్రమాణంచేసి తర్వాత విచారణ ప్రారంభమయింది.

"ఏమయ్యా రాత్రి ఎనిమిదిగంటల ప్రాంతంలో సినిమాహాలు

ముందు అందరూ తిరిగేటప్పుడు మూత్రవిసర్జన చేసింది నిజమేనా అడి గాడు మేజిస్ట్రేటు.

"రామ! రామ! నాకు సిగ్గూ, శరమూ రెండూ వున్నాయండీ. నానటువంటిపని సస్తే సేయను."

"అయితే నువ్వు మూత్రవిసర్జన చేయలేదంటావ్"

"అబద్ధం సెప్పనండి. ఒకటికి పోసింది మాత్రం నిజమేనండి. అర్ధరాత్తిరి సినిమా అయిపోయి అందరూ ఎల్లింతర్వాత రోడ్డుకు దూర ముగా సినిమాహాలు గోడదగ్గర సీకట్లో పోసినమాట వాస్తవమేనండి"

"అక్కడ పోయవచ్చని ఎవరు చెప్పారు" క్రాసుచేశాడు మేజిస్ట్రేటు.

"నాకెవరూ సెప్పలేదండి. పోలీసుగోరు పోత్తుంటే ఇక్కడ పోసుకోవచ్చుగందా అని పోసానండి"

"ఏమిటి నువ్వనేది" ఆశ్చర్యంగా అడిగాడు మేజిస్ట్రేటు.

"అవును దొరగారూ! నన్ను పట్టుకొచ్చిన పోలీసుగోరే అడ పోస్తూ ఉండిరను"

"దానికి సాక్ష్యం ఉందా"

"ఉందిసామే. అదుగో ఆ ఈరాసామిగోరే సాచ్చం" అన్నాడు సుబ్బయ్య

వాకిట్లో గుంపుగా నిలబడి విచారణ చూస్తున్న వాళ్ళలో అంతకు ముందురాత్రి సుబ్బయ్యతో మాట్లాడిన నూతనవ్యక్తి ముందుకువచ్చాడు సుబ్బయ్యను బయటికిరమ్మని, వీరాస్వామిని బోనులో ఎక్కించారు. వీరాస్వామి అంతా నిజమే చెబుతానని ప్రమాణం చేసాడు.

"జరిగింది జరిగినట్లు చెప్పండి" అన్నాడు మేజిస్ట్రేటు.

"అయ్యా నేను ఒంటిగంటకు సినిమాచూసి హాలుబయటకు వచ్చానండి. సైకిలు చైను ఊడిపోతే వేసుకొంటూ అక్కడే ఓ ఇరవైనిముషాలు ఉన్నానండి. మొదట ఈ పోలీసాయన గోడదగ్గర ఒకటికి పోస్తున్నాదండీ. అతను లేవగానే ఈ పెద్దాయన ఆ ప్రక్కనే ఒకటికి పోసాడండి. తరువాత ఈ పోలీసాయన ఆ పెద్దాయనను డబ్బులివ్వమని అతను నేనివ్వలేనని చాలాసేపు గొడవపడ్డారండి అ తరువాత నీమీద కేసు పెడతానంటూ పోలీసాయన ఆ పెద్దాయనను స్టేషనుకు లాక్కెళ్ళాదండి. అక్కడ మరెవరూ లేరుగనుక ఇదంతా నేను కళ్ళకు కట్టినట్లు చూసానండి" అంటూ పోలీసు వెంకటస్వామిని, సుబ్బయ్యనూ చూపించాడు వీరాస్వామి. ఒక న్యాయాన్ని రక్షించడానికి అబద్ధం చెప్పినా తప్పులేదనే సిద్ధాంతం కలవాడు వీరాస్వామి

మేజిస్ట్రేటుకు వళ్ళుమండింది. వీరాస్వామి చెప్పింది చాలా న్యాయమనిపించింది ఆయనకు. సుబ్బయ్య మీద పెట్టిన కేసును కొట్టివేస్తూ, ఇంకెప్పుడు ఇలాంటిపని చేయవద్దని వెంకటస్వామికి వార్నింగిచ్చాడు.

ఇంతవరకూ అపజయమెరుగని వెంకటస్వామికి ఇదొక పెద్ద షాక్. అతనిగోడు వినే నాధుడే కనబడలేదు. తనచుట్టూ వున్న మనుషులు చెట్లు, చేమలూ, భవనాలూ గిర్రున తిరుగుతూ కనిపించాయి. ఇప్పుడు ఏ గాలివీస్తుందో, ఏ దావ ఎత్తాల్నో అతనికి అర్థంకాలేదు.

*